# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 104 ప్రకాశం, బుధవారం 14- 01 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి, రాష్ట్ర ప్రజలకు బోగి,సంక్రాంతి, కనుమ,పండుగల శుభాకాంక్షలు,

వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్,



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా....** మార్కాపురం...రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పర్వదిన శుభాకాంక్షలు అని వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు..ఈ సందర్భంగా వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో భోగి, సంక్రాంతి, కనుమ పండుగల ను ఆహ్లాదకరమైన వాతావరణంలో బంధుమిత్రులతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.. ప్రతి ఒక్కరి జీవితంలో ఈ భోగి, సంక్రాంతి, కనుమ, భోగభాగ్యాలు కలగాలని ఆబిలసించారు..వైసిపి నాయకులు కార్యకర్తలు ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి కి భోగి, సంక్రాంతి, కనుమ పండుగల శుభాకాంక్షలు తెలిపారు......

**క్రైం కౌంటర్ ప్రతినిధి టి నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,** 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్చవాలలో భాగంగా ఆర్టీవో టీవీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణం లో మార్కెట్ యార్డ్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ మంగళవారం జరిగిశీది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని ప్రతి ఒక్క పౌరుడు రహదారి భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని అదేవిధంగా టు వీలర్ డ్రైవ్ చేయువారు హెల్మెట్ ధరించి మాత్రమే వాహనం నడపాలని చెప్పారు.మోటర్ కారు నడుపువారు సీట్ బెల్ట్ ధరించి వాహనం నడుపవలెనని, తమ ప్రాణాలను ఇతరుల ప్రాణములను విలువైనవిగా భావించి బాధ్యతాయుతంగా వాహనం నడపాలని తెలియజేశారు రహదారి భద్రత నియమాలు తూచా తప్పకుండా పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ గడిచిన నాలుగైదు నెలల కాలంలోనే దాదాపు 20 నుండి 30 యాక్సిడెంట్లు జరిగాయని అందులో కేవలం మోటార్ సైకిల్ పై వెళ్తున్న వారు మాత్రమే ఎక్కువగా మృతి చెందారని తెలిపారు. ప్రతి ఒక్కరు రహదారి పట్ల అవగాహన కలిగి ఉండి రహదారి భద్రతను పాటించి ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై సి హెచ్ రాము మాట్లాడుతూ ట్రిపుల్ రైడ్ చేయరాదని హెల్మెట్




ధరించి వాహనం నడుపులని అదేవిధంగా మద్యం సేవించి వాహనం నడపరాదని వేగపరిమితులను పాటించడం సిగ్నల్ జంపింగ్ నివారించడం మరియు లేన్ క్రమశిక్షణను నిర్వహించడం గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు రూరల్ ఎ.ఎస్ఐ కె శ్రీనివాసులు, రవాణా శాఖ ఏవో కె శివ ప్రసాద్, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపిన దారపనేని



**పామూరు, జనవరి 13, క్రైం కౌంటర్** కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కి, తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు వారి కుటుంబ సభ్యులకు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండుగనాడు దక్షిణాయణంలో తాము ఎదుర్కొన్న కష్టాలు, బాధలను భోగిమంటల రూపంలో అగ్ని దేవుడికి సమర్పించి రాబోయే ఉత్తరాయణం లో భోగిమంటల వెలుగులలో భోగభాగ్యాలను ప్రసాదించమని ప్రజలు ప్రార్థిస్తారని దారపనేని పేర్కొన్నారు. తెలుగువారు పెద్ద పండుగ అని ముద్దుగా పిలుచుకునే సంక్రాంతి పండుగ రోజున సూర్యుడు మకర రాశి నందు ప్రవేశిస్తాడు. మకర సంక్రమణం జరిగినందున మకర సంక్రాంతి అని పిలుస్తారని, ఇండ్ల ముందు రంగు రంగు ముగ్గులతో, గొబ్బెమ్మలతో స్వాగతం పలుకుతూ, హరిదాసు హరినామ కీర్తనలతో ప్రజలను భక్తి మార్గంలోకి మరలుస్తారని దారపనేని చంద్రశేఖర్ తెలిపారు. కనుమ పండుగ రోజున పంటలు చేతికి అందడంతో తమకు సహాయపడిన పశు పక్షాదులను పూజిస్తారని, కనుమ రోజు రథము ముగ్గులను సూర్యగమనానికి సంకేతముగా వేస్తారని, పెద్దలకు, పోతురాజులకు మొక్కులు జాతరలు చెల్లించి కమ్మని కనుమును ప్రజలందరూ, కుటుంబ సమేతంగా సంతోషంగా జరుపుకోవాలని దారపనేని ఆకాంక్షించారు.

## గుంటూరు పట్టణంలోఆటోలో పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ నీ తిరిగి మహిళ కు అందచేసిన కొత్తపేట పోలీసులు



**క్రైమ్ కౌంటర్ న్యూస్ ...గుంటూరు జిల్లా....** చిలకలూరి పేట కి వెళ్ళడానికి హనుమయ్య కంపెనీ నుండి గాంధీ పార్కు వద్దకు ప్రయాణం చేసిన మహిళ... హడావుడిలో ఆటోలో మర్చిపోయిన బ్యాగ్...కొత్తపేట పోలీసులకి పిర్యాదు చెయ్యడంతో సీఐ వీరయ్యా ఆధార్యంలో దరప్తు ప్రారంభించిన కొత్తపేట క్రైమ్ పోలీసులు...గంటల వ్యవధిలోనే ఆటో డ్రైవర్ నుండి బ్యాగ్ స్వాధీనం ...మహిళకు బ్యాగ్ అందజేత... మహిళ బ్యాగ్ లో దాదాపు 5 లక్షల విలువ చేసే బంగారం...

## సంక్రాంతి సంబరాలు సీఎం కుటుంబ సభ్యులు





**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి వారి స్వగ్రామం నారావారిపల్లెలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు హాజరయ్యారు. సీఎం చంద్రబాబు తో పాటు, ఆయన సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి , రాష్ట్ర మంత్రి యువనేత లోకేష్ , నారా బ్రాహ్మణి సంబరాల్లో భాగంగా గ్రామంలోని చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, బ్యాలెన్స్ వాకింగ్, గన్నీ బ్యాగ్ రేస్, లెమన్ అండ్ స్పూన్, కాక్ ఫైట్, త్రీలెగ్ రేస్, గ్లాస్ అండ్ బెలూన్ రన్ వంటి పలు క్రీడలను నిర్వహించారు. వీటన్నింటినీ సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించి సంతోషంగా గడిపారు. క్రీడలలోచంద్రబాబు బాలకృష్ణ మనవళ్లు పాల్గొన్నారు. అనంతరం ఆటల్లో విజేతలైనవారికి బహుమతులను అందజేశారు. చిన్నారులందరితో ఫోటోలు దిగి ఆప్యాయంగా సీఎం చంద్రబాబు ముచ్చటించారు. దాదాపు రెండు గంటల సేపు గ్రామస్తులు, చిన్నారులతో ఆయన గడిపారు. మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి వారికి బహుమతులను అంద జేశారు .అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను అందుకుని పరిష్కారానికి సీఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఇన్చార్జి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు లోగిళ్లలో భోగి వెలుగులు: సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 13** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ ఆరంభ వేడుకైన 'భోగి' శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, తెలుగు రాష్ట్రాల్లోని లోగిళ్లన్నీ సంక్రాంతి ముగ్గులతో కళకళలాడుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. భోగి మంటల వెలుగులు ప్రతి ఇంటిలోనూ కొత్త ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ, భోగి మంటలు కేవలం చలిని పారద్రోలడమే కాకుండా, ప్రజల జీవితాల్లో ఉన్న చీకట్లను తొలగించి కొత్త వెలుగులు తీసుకురావాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఈ పండుగను జరుపుకోవాలని, ఈ పర్వదినం అందరి కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఆయన తన సందేశంలో ఆశావహ దృక్పథన్ని వ్యక్తం చేశారు. ప్రజల కలలు, ఆలోచనలు నిజం కావడానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని చంద్రబాబు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఆశావహ దృక్పథంతో ముందడుగు వేసే ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామని, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆశయాలు సాకారం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. చివరగా, తెలుగు వారందరి జీవితాలు భోగభాగ్యాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. సంప్రదాయాలకు నెలవైన ఈ సంక్రాంతి సంబరాలు ప్రతి ఒక్కరి ఇంట్లో సిరిసంపదలను నింపాలని ఆశిస్తూ, రాష్ట్ర ప్రజలందరికీ ఆయన మరోసారి హృదయపూర్వక భోగి శు



భాకాంక్షలు అందజేశారు.



## వాసవి నగర్ లో ఉచిత దంత వైద్య శిబిరం

**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** పట్టణంలోని వాసవి నగర్‌లో హేష్విత డెంటల్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలోఉచిత దంత ఆరోగ్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలోడా. పాలడుగు దేవి నవ్య డా. గౌతమ్ నెప్పాల లు ప్రత్యక్షంగా పాల్గొని పెద్దలు,పిల్లలకు ఉచితంగా దంత పరీక్షలను నిర్వహించి,దంత వ్యాధులు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పిల్లలకు సరైన బ్రషింగ్ విధానం,నోటి పరిశుభ్రతపైప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఉచితంగా బ్రష్, టూత్‌పేస్ట్, మౌత్‌వాష్, మాత్రలు పంపిణీ చేశారు. శిబిరానికి వాసవి నగర్ ప్రజల నుండి మంచి స్పందన లభించిందని డాక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా వాసవి నగర్ కమిటీ సభ్యులు డాక్టర్లను సత్కరించి అభినందనలను తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు నాణ్యమైన దంత వైద్యం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

## భోగి పండుగ శుభాకాంక్షలు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** ప్రకాశం నెల్లూరు చిత్తూరు ప్రజలకు కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి మకర సంక్రాంతి పండుగల సమూహంలో మొదటి రోజు.. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడాన్ని ఈ పండుగ సూచిస్తుందని తెలిపారు. పాత బాధలు, కష్టాలుభోగి మంటల్లో దహనమైకొత్త ఆశలు, కొత్త వెలుగులు అందరి జీవితంలో వెలిగిపోవాలని భోగి పండుగ ప్రకృతి పునర్జీవనానికి గుర్తుగా జరుపుకుంటారని, భోగి పండుగను కుటుంబ సమేతంగా ఆనందాల మధ్య జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## సాంస్కృతిక కార్యక్రమాలకు 20,116 అందజేసిన.. ఆకుపాటి రమణయ్య (టిడిపి నాయకులు, రియల్టర్)



**పామూరు, జనవరి 13, క్రైం కౌంటర్** గోపాలపురం నందు సంక్రాంతి సందర్భంగా కె ఆర్ (కాపు రాక్స్) అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సంస్కృతిక కార్యక్రమంలో భాగంగా మునుపటి వాగ్దానం మేరకు కాపు రాక్స్ టీమ్ కి ప్రకాశం జిల్లా ఎంపీటీసీ సంఘం ఆకుపాటి వెంకటేష్ కార్యాలయంలో రూ- 20,116 అందజేసినౌ.. ప్రముఖ రియల్టర్, టిడిపి నాయకులు ఆకుపాటి రమణయ్య, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ అందజేశారు

## గ్రామపంచాయతీలు పరిశుభ్రంగా ఉండాలి! వై .శంకర రావు




**వలేటివారిపాలెం క్రైశీ కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి,** మండలపరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపడుతుందని ఎంపీడీవో వై. శంకర రావు అన్నారు. ఇందులో భాగంగా మండలంలోని చుండిలో ప్రభుత్వం పరిశుభ్రతే లక్ష్యంగా గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ హితం, కాలుష్య రహిత పారిశుద్ధ్య సేవల కోసం ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించే ప్రక్రియలో ప్రజలు సహకరించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన... నల్లబోతుల వెంకటేశ్వర్లు (ఇనిమెర్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు)



**పామూరు, జనవరి 13, క్రైం కౌంటర్** కనిగిరి నియోజకవర్గ ప్రజలకు , నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పామూరు మండల ఇన్నిమెర్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు భోగి,సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను నియోజకవర్గ ప్రజలందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, భోగిమంటలతో ప్రతి కుటుంబంలో భోగభాగ్యాలు వెల్లి విరియాలని, సరదాల సంక్రాంతిని సరదాగా జరుపుకోవాలని కమ్మని కనుముతో ప్రతి కుటుంబము సంతోషభరితంగా వర్ధిల్లాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

## ఏపీ ఎక్సైజ్ పాలసీ 2026: బార్ల వ్యాపారులకు కొత్త మార్గదర్శకాలు




**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 13** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ పాలసీలో కీలక మార్పులు చేసింది. రాష్ట్రంలో బార్లపై ఇప్పటివరకు విధింపబడుతున్న అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను రద్దు చేశారు. దీని ద్వారా మద్యం ఏ షాపు లేదా బార్ల నుండి కొనుగోలు చేసినా ఒకే రేటులో అందించబడుతుంది. ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనా ఈ మేరకు ముఖ్య ఉత్తర్వులు జారీ చేశారు. 2019 నవంబర్ నుంచి అమల్లో ఉన్న ప్రత్యేక అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను తొలగిస్తూ జీఎంఎస్ నంబర్ 24ని మంగళవారం జారీ చేశారు. ఈ నిర్ణయం బార్ల వ్యాపారులకు పెద్ద ఊరట కలిగిస్తుంది. ఇకపై రిటైల్ షాపులు, బార్ల మధ్య ధరల్లో తేడా ఉండదు. ధరల్లో సమానత్వం తీసుకురావడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశం అని అధికారులు పేర్కొన్నారు. ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నుంచి బార్లకు సరఫరా చేసే ఐఎంఎఫ్ఎల్, ఎఫ్ఎల్‌పై అదనపు పన్నులు ఇకపై విధించబడవు. అదనంగా, ఎక్సైజ్ చట్టాల ప్రకారం కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని, 2025 బార్ లైసెన్స్ నిబంధనల్లో అవసరమైన సవరణలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త మార్పులు అమలుకు డైరెక్టర్ ఆఫ్ ఎక్సైజ్, డిస్టిలరీస్ కమిషనర్, ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు బాధ్యత వహిస్తారు. ఈ నిర్ణయం జనవరి 13 నుండి అమల్లోకి వస్తుంది. గతంలో రిటైల్ షాపుల కంటే బార్లకు మద్యం ఎక్కువ ధరకు సరఫరా కావడం వల్ల వ్యాపారంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. కొత్త మార్పులతో ఖర్చులు తగ్గి, బార్లకు పెద్ద ఊరట లభించిందని వ్యాపారులు పేర్కొన్నారు.

## కోడిపందేల బరి తొలగింపు



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,,** మండలంలోని పలుకూరు పంచాయతీ పరిధిలోనిపత్తిపాటివారిపాలెం గ్రామ శివారులో సంక్రాంతి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన కోడి పందేల బరీని జెసిబి సహాయంతో తొలిగించారు. ఆ స్థలాన్ని దున్నించామని రూరల్ ఎస్సై మహేంద్ర నాయక్ తెలిపారు

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన... కుందూరి నాగార్జున (కనిగిరి నియోజకవర్గం తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు)




**పామూరు, జనవరి 13, క్రైం కౌంటర్** కనిగిరి నియోజకవర్గ ప్రజలకు , నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు మార్కాపురం జిల్లా, కనిగిరి నియోజకవర్గం తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు కుందూరి నాగార్జున భోగి,సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను నియోజకవర్గ ప్రజలందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, భోగిమంటలతో ప్రతి కుటుంబంలో భోగభాగ్యాలు వెల్లి విరియాలని, సరదాల సంక్రాంతిని సరదాగా జరుపుకోవాలని కమ్మని కనుముతో ప్రతి కుటుంబము సంతోషభరితంగా వర్ధిల్లాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## పందేల బరి తొలగింపు



**క్రైం కౌంటర్ ప్రతినిధి ఉలవపాడు,** మండలంలోని రామాయపట్నం రిసార్ట్, చాకిచర్ల పెద్ద పట్టపు పాలెం గ్రామ శివారు లో రొయ్యల చెరువుల వద్ద సంక్రాంతి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన కోడి పందేల బరి ని ట్రాక్టర్ గొర్రు సహాయంతో దున్నించామని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

## జాతీయ జనవిజ్ఞాన వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ



**పామూరు, జనవరి 13, క్రైం కౌంటర్** పామూరు పట్టణంలోని జాతీయ జనవిజ్ఞాన వేదిక (ఏ పార్టీలకు అనుబంధం లేని సంస్థ) కార్యాలయం నందు మండల గౌరవ అధ్యక్షులు జొన్నలగడ్డ గోవిందయ్య ,అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, ప్రధాన కార్యదర్శులు ఎస్ వి ప్రసాద్ ,ఆవుల మురళి, సయ్యద్ మౌలాలి ఆధ్వర్యంలోఆవిష్కరించారు . ఈ కార్యక్రమంలో షేక్ సలాం సత్తార్ పి సిద్దయ్య ,శ్రీరామ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రవీందర్ ,బి టి ఏ రాష్ట్ర నాయకులు ఎం ముసలయ్య మరియు మండల శాఖ ఉపాధ్యక్షుడు జి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ - మార్కాపురం జిల్లా



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా...**మార్కాపురం పట్టణం నందు శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపం నందు స్టార్ మస్తాన్ , కుమారుడి వివాహా మహెూత్సవానికి హాజరైన జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ ఇమ్మడి కాశీనాథ్ . ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొందిలి కాశీరామ్ సింగ్, జిల్లా కార్యదర్శి శిరిగిరి శ్రీనివాసరావు, జనసేన నాయకులు విజయరావు నరసింహారావు, పిన్నెబోయిన శ్రీనివాసులు, బెల్లంకొండ గోపి, షేక్ షరీఫ్, ఉమ్మడి రవీంద్ర, శివ సింగ్ మరియు తదితరులు పాల్గొన్నారు....

## రాష్ట్రాలకు సుప్రీం సీరియస్ వార్నింగ్.. ఇకపై రాష్ట్రాలదే బాధ్యత!



**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 13** ఢిల్లీ: భారతదేశంలో వీధి కుక్కల దాడుల విషయంపై సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రాలు.. వీధి కుక్కల నివారణకు సరైన చర్యలు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. కుక్కలు కరవడం వల్ల పిల్లలు, వృద్దులు ఎలాంటి ప్రమాదానికి గురైనా, దానికి సంబంధించిన నష్ట పరిహారం రాష్ట్రాలే చెల్లించేలా ఆదేశిస్తామని హెచ్చరించింది ధర్మాసనం. ఇటీవల వీధి కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోవడం వల్ల ప్రజలు రేబిస్‌తో పాటు ఇతర ప్రమాదకర వ్యాధుల బారినపడుతున్నారు. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. స్కూల్స్, హాస్పిటల్స్, బస్టాండ్స్, రైల్వే స్టేషన్స్, ఎయిర్ పోర్ట్స్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు సంచరిస్తుంటారు. అలాంటి ప్రదేశాల్లో ఎక్కువగా వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయని, వాటికి ప్రత్యేకంగా షెల్టర్లు(రాజూవఎఱశ్రీ ంష్ట్రవశ్రీ-వతీం) ఏర్పాటుచేసి అక్కడికి తొలగించాలని ఆదేశించింది. కాగా.. దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన కేసును న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతా, ఎన్వీ.అంజరియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

'కుక్కల వల్ల ఎవరికి నష్టం జరిగినా రాష్ట్రాలే బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించేలా ఆదేశిస్తాం. కుక్కలకు ఆహారం పెట్టేవారు వారి ఇంట్లోనే పెంచుకుని అక్కడే వాటికి తిండిపెట్టాలి. జంతు ప్రేమికులం అని చెప్పుకు తిరిగేవారు.. ఇటీవల ఓ తొమ్మిదేళ్ల బాలుడిపై కుక్కలు అతి దారుణంగా దాడిచేసినపుడు ఎందుకు బాధ్యత తీసుకోలేదు' అని ప్రశ్నించారు. వీధుల్లోని అన్ని కుక్కలను తొలగించాలని తామెప్పుడూ ఆదేశించలేదు. యానిమల్ బర్త్ రూల్ ప్రకారం.. ట్రీట్‌మెంట్‌కాని శునకాలను షెల్టర్లకు తరలించాలని తెలిపినట్లు సుప్రీం ధర్మాసనం తెలిపింది.

## రాహుల్ గాంధీ వియత్నాం పర్యటనపై బీజేపీ ధ్వజమెత్తు..

**క్రైం కౌంటర్ న్యూస్ , జనవరి 13** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వియత్నాం పర్యటన మరోసారి రాజకీయ దుమారానికి తెరలేపింది. ఆయన విదేశీ పర్యటనలపై భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. దేశంలో కీలకమైన అంశాలపై చర్చ జరగాల్సిన సమయంలో రాహుల్ గాంధీ అందుబాటులో లేకపోవడంపై బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి, పదేపదే విదేశాలకు వెళ్లడం ఆయన సీరియస్‌నెస్‌ను ప్రశ్నిస్తోందని కమలనాథులు వాదిస్తున్నారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఈ పర్యటనపై స్పందిస్తూ రాహుల్ గాంధీని 'పర్యాటక నాయకుడు' (టూరిస్ట్ లీడర్) గా అభివర్ణించారు. రాహుల్ గాంధీ ఎప్పుడూ సెలవుల మూడ్‌లోనే ఉంటారని, జాతీయ స్థాయిలో ముఖ్యమైన సమస్యలు ఎదురైనప్పుడు ఆయన విదేశాల్లో గడపడం అలవాటుగా మార్చుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలపై పోరాడటం కంటే విదేశీ విహారయాత్రలకే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారని పూనావాలా విమర్శించారు. రాహుల్ గాంధీ రాజకీయ పరిణతిపై కూడా బీజేపీ ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించింది. ఆయన ఒక అపరిపక్వ నాయకుడని, దేశ ప్రజల పట్ల ఆయనకు కనీస బాధ్యత లేదని పూనావాలా మండిపడ్డారు. ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషించడంలో ఆయన విఫలమవుతున్నారని, ఇలాంటి చర్యల వల్ల ప్రజల్లో కాంగ్రెస్ పట్ల నమ్మకం సన్నగిల్లుతుందని ఆయన పేర్కొన్నారు. కేవలం ఫోటో షూట్‌ల కోసం, వ్యక్తిగత పర్యటనల కోసమే ఆయన సమయాన్ని కేటాయిస్తున్నారని విమర్శించారు. అయితే, రాహుల్ గాంధీ వియత్నాం పర్యటనకు సంబంధించి అటు కాంగ్రెస్ పార్టీ గానీ, ఇటు రాహుల్ గాంధీ వ్యక్తిగత బృందం గానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## సీఎం సహాయనిది చెక్కులు పంపిణీ.. ఎం ఎల్ ఏ ఇంటూరి నాగేశ్వరరావు

**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,**రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతోపాటు ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా కందుకూరు నియోజక వర్గానికి అధికంగా నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. 55 మంది పేదలకు 59.05 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను, స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు కందుకూరు నియోజకవర్గంలో 975 మందికి 7.8 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ అనేది అందరి ద్రాక్షలా ఉ ండేదని, ఒకరికో ఇద్దరికో మాత్రమే సహాయం చేసి, ప్రచారం మాత్రం గొప్పగా చేసుకున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విమర్శించారు. ఓటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సహాయం అందిస్తున్నారని చెప్పారు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే, లక్షలకు లక్షల ఖర్చు చేసే ఆర్థిక స్థోమత పేదలకు ఉండదని, అలాంటివారికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం చేయాలన్న గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి ముందుకు వెళుతున్నారని పేర్కొన్నారు. సహాయం అందుకున్న వారందరూ ముఖ్యమంత్రి యువ నాయకులు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకు రుణపడి ఉంటారని తెలిపారు.

లబ్ధిదారులు వివరములు వలేటివారిపాలెం మండలం 21 మంది లబ్ధిదారులు



17.08 లక్షలు ,కందుకూరు మండలం 15 మంది లబ్ధిదారులు 25.19 లక్షలు,కందుకూరు పట్టణం 19 మంది లబ్ధిదారులు 16.77 లక్షలు ,మొత్తం 55 మంది లబ్ధిదారులు 59.05 లక్షలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండలం టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, షేక్ రూబీ, నాదెళ్ల వెంకట రమణయ్య, నియోజకవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక పాల్గొన్నారు.

## నేడు తెల్లవారగానే కోడి పందేలతో ఫుల్ జోష్



ఏ ఇల్లు చూసినా కళకళ! కుటుంబ సభ్యులు, బంధువుల రాకతో ఒక్కటే సందడి! సంక్రాంతి ముందే గ్రామాల్లో పండగ వాతావరణం! మరోవైపు కోడి పందేలకు బరులు సిద్ధం! తెల్లవారడమే ఆలస్యం.. పందేలకు సై అంటున్నారు. బుధవారం భోగితో సంక్రాంతి సంబరాలతో పాటు కోడి పందేలూ మొదలవుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పందెంకోళ్లు కాళ్లు దువ్వుతున్నాయి. బరిలో తాడోపేడో తేల్చుకునేందుకు కొక్కొరో..కో అంటూ సవాల్ విసురుతున్నాయి. సంప్రదాయం పేరిట సంక్రాంతి మూడు రోజులూ యథేచ్ఛగా కోడి పందేలు ఆడటానికి రంగం సిద్ధమైంది. పెద్ద ఎత్తున బరులు ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారు. కోడి పందేలతో పాటు అదే సమయంలో గుండాటలు, పేకాటలూ జోరుగా జరగనున్నాయి. కోడిపందేలు తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు రాజకీయ, సినీ, పారిశ్రామిక ప్రముఖులు ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాలకు రానున్నారు. విజయవాడలో మొత్తం హెూటళ్లు, లాడ్జీలు నిండిపోయాయి. ఏకంగా 5 వేల గదులను బుక్ చేసుకున్నారు. తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు ఇక్కడ బస చేసి, కోడి పందేలు చూసేందుకు ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాలకు వెళ్లనున్నారు. ఈ సీజన్‌లో ఎన్టీఆర్-ఏలూరు జిల్లా సరిహద్దున వీవీఐపీల కోసం ఏకంగా క్యారవాన్స్ ఏర్పాటు చేయడం ప్రత్యేకత. పలు ప్రాంతాల్లో విజేతలకు అందజేసేందుకు కార్లు, బుల్లెట్లు, బైకులు సిద్ధంగా ఉంచారు. కొన్ని చోట్ల ముహూర్తం కోసం మంగళవారమే పందేలను లాంఛనంగా ప్రారంభించారు.పోలీసులతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో, వారికి మామూళ్లతో ఈ జూద క్రీడలు హెూరెత్తిపోనున్నాయి. సంక్రాంతి సంబరాలు, కోడి పందేలు చూసేందుకు ఇతర రాష్ట్రాలు, నగరాల నుంచి గోదావరి జిల్లాలకు బస్సులు, వాహనాల్లో పెద్దఎత్తున వస్తూనే ఉన్నారు. విజయవాడ నుంచి ఆ జిల్లాలకు వచ్చే వాహనాల సంఖ్య మంగళవారం భారీగా పెరిగింది. కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాల రద్దీ పెరిగింది. మంగళవారం రాత్రి 8 గంటల వరకూ 17,221 వాహనాలు దాటాయి. తెల్లవారేసరికి మరో 20 వేల వరకూ వస్తాయని అంచనా.

### తూర్పులో 'ఢీ'కి.. బరులు రెడీ

అమలాపురం, రాజోలుతో పాటు మెట్ట ప్రాంతమైన జగ్గంపేట తదితర చోట్ల బరులకు బోణీ చేశారు. కోనసీమలో వందకు పైగా సిద్ధమయ్యాయి. ముఖ్యంగా ఐ.పోలవరం మండలం మురమళ్లలోని సువిశాలమై ప్రాంతంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో పందేలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లాలోనే అతిపెద్ద వీఐపీ బరిగా పేరొందిన ఇక్కడకు వచ్చే అతిథులు, పందెంరాయుళ్లకు సకల సౌకర్యాలు కల్పించారు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లోనూ వందల బరుల్లో పందేల జోరు కొనసాగనుంది. ఇక ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చిన్నాపెద్దా కలిపి ఒక్కో బరిలో రోజుకు కోడి పందేలు, గుండాట కలిపి రూ. 15 లక్షల నుంచి రూ. 1.50 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతాయని అంచనా. మురమళ్లలో రోజుకు రూ. 2 కోట్ల వరకు లావాదేవీలు జరగనున్నాయి. కాకినాడ రూరల్, తుని, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురంలో అత్యధిక పందేలు గెలిచిన వారికి బుల్లెట్లు, కార్లు గిఫ్టులుగా ఇవ్వబోతున్నారు. కరప మండలంలో మూడు రోజుల పందేల విజేతకు ఇన్నోవా కారు అందించనున్నట్టు ప్రకటించారు. వెరసి ఉమ్మడి జిల్లాలో భోగి రోజు కోడి పందేలు, గుండాటల్లో రూ. 70 కోట్లు చేతులు మారతాయని భావిస్తున్నారు.

### బాపట్లలో కత్తులు దూసిన కోళ్లు

బాపట్ల జిల్లాలో మంగళవారమే సంక్రాంతి సందడి మొదలైంది. చుట్టుపక్కల జిల్లాలతోపాటు తెలంగాణ నుంచి కూడా వేలాది మంది తరలివచ్చి లక్షల్లో పందేలు కాశారు. జిల్లాలోని అధికార పార్టీ ప్రధాన నేత ఆధ్వర్యంలో పది బరులు ఏర్పాటు చేశారు. వాటి సమీపంలోనే పేకాట, కోతముక్క, గుండాట, నంబర్ల ఆటలు నిర్వహించారు. చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో రూ. 10వేలు, రూ. 20వేలు, రూ. 50వేలు, రూ.లక్ష విభాగాల్లో ప్రత్యేక బరులు ఏర్పాటు చేశారు. వీఐపీ బరుల్లో లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు పందేలు నిర్వహించారు. మహిళలు సైతం భారీగా తరలివచ్చారు. బరుల వద్దే ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు.


### బెజవాడ హౌస్‌ఫుల్

విజయవాడలో అన్ని స్టార్ హెూటళ్లు, లాడ్జీలు నిండిపోయాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గన్నవరం నియోజకవర్గంలో కేసరపల్లి, గుడివాడ, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో భారీగా బరులు ఏర్పాటు చేశారు. నందిగామ నియోజకవర్గంలో కొత్తగా క్యాసినోను పరిచయం చేస్తున్నారు. సంక్రాంతి సంబరాలను వీక్షించడానికి పొరుగున ఉన్న తెలంగాణ నుంచి సందర్శకులు భారీగా వస్తున్నారు. విజయవాడలో వసతి ఏర్పాటు చేసుకోవడంతో నగరంలో మొత్తం 15 స్టార్ హెూటళ్లు, 80 లాడ్జీలలో మొత్తం 5 వేల గదులు నిండిపోయాయి. గదులన్నీ వారం రోజుల వరకు బుక్ చేసుకున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. విజయవాడలో వసతి ఏర్పాటు చేసుకుని సందర్శకులు గుడివాడ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో జరిగే కోడిపందేలను చూడటానికి వెళ్తారు. కొంతమంది ఏలూరు జిల్లా మీర్జాపురంలో ఏర్పాటు చేసిన హైటెక్ కోడిపందేల శిబిరం వద్దకు, మరికొంతమంది భీమవరంలో జరిగే బరుల వద్దకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ సంక్రాంతి సీజన్‌లో మొదటిసారిగా క్యారవాన్స్‌ను కూడా సిద్ధం చేశారు. కృష్ణా-ఏలూరు జిల్లాల మధ్యన గన్నవరం, నూజివీడుల సరిహద్దున బిళ్ళనపల్లి, మీర్జాపురంల వద్ద ఏర్పాటు చేస్తున్న టెక్ కోడి పందేలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వీవీఐపీలు వస్తున్నారు. పలువురు రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, సినీ రంగానికి చెందిన ప్రముఖులు వస్తున్నారు. ఇప్పటికే వీరికోసం ఏసీ గ్లాస్ గ్యాలరీలను ఏర్పాటు చేశారు. విజయవాడ, హనుమాన్ జంక్షన్, ఏలూరు, నూజివీడు, గన్నవరంలో హెూటల్స్ అన్నింటినీ వీరి కోసం బుక్ చేశారు. పోటీలు జరిగే రోజున అక్కడే విశ్రాంతి తీసుకోవటానికి నిర్వాహకులు క్యారవాన్స్ రప్పించారు. మంగళవారం సాయంత్రానికి నాలుగు రాగా, అర్ధరాత్రికి మరో ఆరు వరకు రానున్నాయి. రూ.కోట్లలో పందేలు కాస్తుండటంతో.. అతిథులకు ఆ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కువ పందేలు కొట్టేవారికి థర్, బ్రెజా కార్లను కూడా ఇస్తున్నారు. వీటిని భోగి రోజున బరులకు తీసుకువస్తారు. రామన్నగూడెం, సింగన్నగూడేలలో పందేల నిర్వాహకులు విజేతలకు బైక్‌లు ఇస్తున్నారు.

### ఏలూరు జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు

ఏలూరు జిల్లాలో కోడి పందేలకు బరులు సిద్ధమయ్యాయి. పోలీసులు పలుచోట్ల అడ్డుకున్నప్పటికీ బుధవారం ఉదయానికి పునరుద్ధరించే దిశగా రాజకీయ నాయకులు పావులు కదుపుతున్నారు. పందెం కోళ్ల పోట్లాటకు బోగి రోజు ఉదయం 10.30 గంటలకు ముహుర్తాలను కూడా పెట్టేసుకున్నారు. నూజివీడు రూరల్ మండలం మీర్జాపురంలో 10 ఎకరాల బరి సిద్ధమైంది. రాజకీయ నాయకులు, ముఖ్యమైన నేతలతో మూడు రోజులు పందేలు వేస్తారు. గుండాట, లోన, బయట పేకాటకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ మూడు వేలమందికి పైగా కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. కైకలూరు రూరల్ మండలంలోని భుజబలపట్నంలో ప్రతీ రోజు రెండు కోట్లకు పైగా డబ్బులు చేతులు మారుతాయని చెబుతున్నారు. ఇక్కడ కైకలూరు-నరసాపురం హైవే పక్కన భారీ సెట్టింగులతో రెండు ఎకరాల్లో బరి ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఆకివీడు, దుంపగడప, ఉండి, కైకలూరు, ఏలూరు, ఏలూరుపాడు, ఐ.భీమవరం, కలిదిండి నుంచి పెద్ద ఎత్తున తిలకించడానికి వస్తారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో 5 ఎకరాలోపు స్థలాన్ని బరులకు సిద్ధం చేశారు. పోలవరం ముంపు మండలమైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో భారీగా బరులు సిద్ధం చేశారు. చింతలపూడిలో తెలంగాణ సరిహద్దు సమీపంలోని చింతపల్లి, రాఘవాపురంలో మామిడి, పామాయిల్ తోటల్లోనే భారీగానే జరగనున్నాయి. ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఇళ్ల స్థలాల మధ్య భారీ బరిలో హైటెక్ ఏర్పాట్లు చేశారు. తెలంగాణ నుంచి కూడా ఇక్కడకు భారీగా రానున్నారు. ముదినేపల్లిలో పెదపాలపర్రు, బొమ్మినంపాడులో వరుసగా ఐదు పందేల్లో గెలిచిన పుంజు యజమానికి కారును బహుమతిగా ఇవ్వనున్నారు.

# సినిమా



## ఆ ఇద్దరు హీరోలే నాకు ఆదర్శం.

అనగనగా ఒక రాజు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను గ్రాండ్ గా నిర్వహించారు. అనగనగా ఒక రాజు ప్రీ-రిలీజ్ వేడుక వరంగల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో హీరో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. గతంలో జాతి రత్నాలు ప్రీ-రిలీజ్ ఈవెంట్ సమయంలో వరంగల్ ప్రజలు ఇచ్చిన ప్రోత్సాహం, ఎనర్జీని గుర్తుచేసుకున్నారు. ఆ మద్దతుతోనే బుక్ మై షోలో టికెట్లు వేగంగా అమ్ముడయ్యాయని అన్నారు నవీన్ పోలిశెట్టి. అనగనగా ఒక రాజు సినిమా ప్రమోషన్స్ గురించి మాట్లాడుతూ,భీమవరం నుంచి ప్రారంభించి ఆంధ్ర, తెలంగాణలోని అనేక ప్రాంతాలకు వెళ్ళమని చెప్పారు. సినిమా విడుదల తర్వాత అమెరికా టూర్‌కు కూడా వెళ్లనున్నట్లు తెలిపారు. తన సినిమాలకు మార్కెటింగ్ చేసేది ప్రేక్షకులేనని, తన జర్నీలో ప్రతి సినిమాకు వర్డ్ ఆఫ్ మౌత్ చాలా బలంగా పనిచేసిందని నవీన్ అన్నారు. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సమయంలో పది షోలు కూడా దొరకని పరిస్థితి నుంచి ప్రేక్షకుల మద్దతుతో సినిమా బ్లాక్‌బస్టర్ అయ్యిందని అన్నారు నవీన్. ప్రేక్షకులు చూపించిన ప్రేమ, అభిమానం తనకు డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే స్ఫూర్తి ని ఇచ్చాయని, ఆ తర్వాతే అనగనగా ఒక రాజు కథ రాశారు అని నవీన్ తెలిపారు. ఈ సినిమాలో ఆకట్టుకునే వినోదంతో పాటు, రెండవ భాగంలో ఒక అందమైనఎమోషనల్ డ్రామా కూడా ఉందని నవీన్ అన్నారు. జనవరి 14న టికెట్లు బుక్ చేసుకుని థియేటర్లకు వచ్చి కూర్చుంటే, ప్రేక్షకులకు బోర్ కొట్టకుండా వినోదాన్ని అందించి, సంక్రాంతికి ఒక మంచి సినిమాను అందించే బాధ్యత తమదని నవీన్ పొలిశెట్టి స్పష్టం చేశారు.

నాకు కుటుంబ నేపథ్యం లేకపోయినా, నాకు బ్యాక్‌గ్రౌండ్‌లో చాలా మంది కుటుంబాలు (అభిమానులు) ఉన్నారు అని నవీన్ అన్నారు. ఈ కుటుంబాలందరినీ తన చివరి శ్వాస వరకు అలరించడానికి ప్రయత్నిస్తానని అన్నారు. తన గురువు చిరంజీవి గారి హుక్ స్టెప్ ఈ సంక్రాంతికి థియేటర్లలో ఒక కొత్త ఎనర్జీని నింపిందని నవీన్ అన్నారు. 90లలో గ్యాంగ్ లీడర్ చిరంజీవి గారిని చూసి ఎలా కేరింతలు కొట్టేవారో, అలాంటి ఎనర్జీని ఆయన థియేటర్లలో తిరిగి తీసుకొచ్చారని అన్నారు. అదే శక్తిని కొనసాగిస్తూ, జనవరి 14న అనగనగా ఒక రాజు థియేటర్లలో అదే వినోదాన్ని అందిస్తుందని నవీన్ చెప్పుకొచ్చారు. రవితేజ కూడా తనకు చాలా ఇష్టమైన వ్యక్తిగా పేర్కొంటూ, చిరంజీవి, రవితేజ లాంటి వారే అని తాను మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చి హీరో అవ్వాలనుకున్నప్పుడు తన కళ్ళ ముందు కనిపించిన పేర్లు చిరంజీవి, రవితేజ అని అన్నారు.





## ఉదయాన్నే ఈ పానియం గ్లాసుడు తాగితే..

ప్రస్తుత కాలంలో అన్ని వయసుల వారు జుట్టు రాలడం సమస్యతో బాధపడుతున్నారు. చెడు జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారం, ఒత్తిడి కారణాలు ఏమైనప్పటికీ చిన్న వయసులోనే జుట్టు రాలడం సమస్య ప్రతి ఒక్కరినీ కలవర పెడుతుంది. ఈ జుట్టు రాలడం సమస్యను వదిలించుకోవడానికి చాలా మంది మార్కెట్లో దొరికే వివిధ హెయిర్ మాస్కులు, నూనెలు వంటి బాహ్య సంరక్షణ ఉత్పత్తులను ఆశ్రయిస్తుంటారు. దీనితో పాటు జుట్టు ఆరోగ్యానికి అంతర్గత పోషకాలు కూడా అంతే ముఖ్యపాత్ర పోషిస్తాయి. మీకూ జుట్టు రాలడం సమస్య ఉంటే వంటగదిలో సులభంగా లభించే ఈ పదార్థాలతో తయారు చేసిన పానియాలను తాగడవ వల్ల సులువుగా చెక్ పెట్టవచ్చు. ఈ పానీయాలు తలలోని చర్మాన్ని లోపలి నుంచి నిర్విషీకరణ చేయడమే కాకుండా జుట్టు మూలాలకు అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి.

మెంతి నీళ్లు

మెంతులలో ప్రోటీన్ , నికోటినిక్ ఆమ్లం ఉంటాయి. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. దీని కోసం మెంతి గింజలను రాత్రంతా నీటిలో నానబెట్టి, వడకట్టి ఉదయం నిద్ర లేవగానే తాగాలి. ఇది జుట్టు రాలడాన్ని తగ్గించడంలో, కొత్త వెంట్రుకల పెరుగుదలకు సహాయపడుతుంది.

గూస్బెర్రీ పానీయం

గూస్బెర్రీల్లో విటమిన్ సి దండిగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. తల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఎండిన గూస్బెర్రీలను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం ఆ నీటిని తాగడం వల్ల జుట్టు ఒత్తుగా, బలంగా పెరుగుతుంది.

కొత్తిమీర నీళ్లు

కొత్తిమీర ఆకులలో ఐరన్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ ఆకులను నీటిలో మరిగించి, వడకట్టి, ప్రతిరోజూ ఉదయం తాగాలి. ఇది రక్తాన్ని శుద్ధి చేస్తుంది. తలకు పోషణను అందిస్తుంది.

అలోవెరా నీళ్లు

అలోవెరాలో జుట్టు కుదుళ్లను పునరుజ్జీవింపజేసే ఎంజైమ్‌లు, అమైనో ఆమ్లాలు ఉంటాయి. ప్రతిరోజూ ఉదయం 2 టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్‌ను గోరువెచ్చని నీటితో కలిపి తాగడం వల్ల జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది.

తులసి నీళ్లు

తులసిలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి తల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. కొన్ని తులసి ఆకులను నీటిలో మరిగించి ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల జుట్టు మూలాలు బలపడతాయి.

దాల్చిన చెక్క నీళ్లు

దాల్చిన చెక్క రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది పోషకాలు తలకు చేరడానికి సహాయపడుతుంది. కాబట్టి దాల్చిన చెక్క ముక్కను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం ఆ నీటిని తాగాలి. ఈ పానీయాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల సహజంగా జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.



## చలికాలంలో థైరాయిడ్ రోగులు ఈ ఆహారాలు తినడం విషంతో సమానం!

శీతాకాలంలో థైరాయిడ్ రోగుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. చలి పెరిగేకొద్దీ శరీరంలో నీరసం, అలసట, బరువు పెరగడం వంటి వివిధ సమస్యలు తలెత్తుతాయి. థైరాయిడ్ ఉన్నప్పుడు మందులతో పాటు సరైన ఆహారం కూడా తీసుకోవడం చాలా ముఖ్యం. ఎక్కువగా వేయించిన, తీపి ఆహారాలు తినడం వల్ల థైరాయిడ్ రోగుల సమస్యలు పెరుగుతాయి. ఇది ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ రకమైన సరికాని ఆహారం మందుల ప్రభావాన్ని కూడా తగ్గిస్తుంది. అందువల్ల లక్షణాలను నియంత్రించడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శీతాకాలంలో ఏ రకమైన ఆహారాలు తీసుకోవాలి? ఏది తినకూడదు అనే దానిపై ప్రత్యేక శ్రద్ధ వహించడం ముఖ్యం. కాబట్టి శీతాకాలంలో థైరాయిడ్ రోగులు ఏ రకమైన ఆహారాలు తినాలో? ఏవి తినకూడదో ఇక్కడ తెలుసుకుందాం..

శీతాకాలంలో థైరాయిడ్ రోగులు ఎలాంటి ఆహారాలు తినకూడదు?

శీతాకాలంలో బయట లభించే వేయించిన, కారంగా ఉండే జంక్ ఫుడ్స్ తినకుండా ఉండాలని డాక్టర్ అమిత్ కుమార్ చెబుతున్నారు. ఎందుకంటే ఇవి బరువు పెరగడానికి, అలసటకు దారితీస్తాయి. సోయా ఆధారిత ఉత్పత్తులను పెద్ద మొత్తంలో తీసుకోవడం వల్ల థైరాయిడ్ హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రోకలీ వంటి కూరగాయలను పచ్చిగా తినడం కూడా సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. ముఖ్యంగా ఎక్కువ చక్కెర, శుద్ధి చేసిన పిండి, బేకరీ ఉత్పత్తులను తీసుకోవడం హానికరం. శీతాకాలంలో థైరాయిడ్ రోగులు టీ, కాఫీని అధికంగా తీసుకోవడం అంత మందిచికాదు. అందువల్ల ఈ ఆహారాలను పరిమితంగా తీసుకోవడం వల్ల లక్షణాలను నియంత్రించడం సులభం అవుతుంది.

థైరాయిడ్ రోగులు తినవలసిన ఆహారాలు

శీతాకాలంలో థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు సమతుల్య, పోషకమైన ఆహారం తీసుకోవాలి. పరిమిత పరిమాణంలో వెచ్చని పాలు, పెరుగు, జున్ను తీసుకుంటే శరీరానికి శక్తిని అందిస్తాయి. ఆకుపచ్చ కూరగాయలు, కాలానుగుణ పండ్లు, ధాన్యాలు అవసరమైన పోషకాలను అందిస్తాయి.

## చరిత్ర సృష్టించేందుకు రోహిత్ శర్మ రెడీ..

భారత క్రికెట్ జట్టు మాజీ సారథి, 'హిట్ మ్యాన్ష రోహిత్ శర్మ మరో అరుదైన మైలురాయిని అందుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు. న్యూజిలాండ్‌తో రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో బుధవారం (జనవరి 14) జరగనున్న రెండో వన్డే ఇంటర్నేషనల్ (ాణ×) మ్యాచ్‌లో రోహిత్ సరికొత్త చరిత్ర సృష్టించే అవకాశముంది.

జాక్వెస్ కల్లిస్ రికార్డుపై కన్నేసిన రోహిత్..

వన్డే ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో రోహిత్ శర్మ ప్రస్తుతం దూసుకుపోతున్నాడు. ఇప్పటివరకు 280 వన్డేల్లో 272 ఇన్నింగ్స్ ఆడిన రోహిత్, 49.11 సగటుతో మొత్తం 11,542 పరుగులు చేశాడు. ఈ రెండో వన్డేలో రోహిత్ మరో 38 పరుగులు చేస్తే, దక్షిణాఫ్రికా దిగ్గజ ఆల్ రౌండర్ జాక్వెస్ కల్లిస్ (11,579 పరుగులు) రికార్డును అధిగమిస్తాడు. తద్వారా వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఎనిమిదవ ఆటగాడిగా రోహిత్ నిలుస్తాడు.

రాహుల్ ద్రవిడ్ రికార్డుకు చేరువలో..

కేవలం పరుగులే కాదు, హాఫ్ సెంచరీల విషయంలోనూ రోహిత్ ఒక ముఖ్యమైన మైలురాయికి దగ్గరగా ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ 50 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేస్తే, వన్డేల్లో అత్యధిక సార్లు 50ం స్కోర్లు చేసిన ఆటగాళ్ల జాబితాలో భారత దిగ్గజం రాహుల్ ద్రవిడ్‌తో (95 హాఫ్ సెంచరీలు) సమానంగా ఎనిమిదో స్థానంలో నిలుస్తాడు. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 94 యాభై ప్లస్ స్కోర్లు ఉన్నాయి. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రికీ పాంటింగ్ వంటి దిగ్గజాలు రోహిత్ కంటే ముందున్నారు.

రాజ్ కోట్ సవాల్..

వడోదరలో జరిగిన మొదటి వన్డేలో రోహిత్ శర్మ 26 పరుగులకే వెనుదిరిగినప్పటికీ, భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. అయితే, రాజ్‌కోట్ స్టేడియంలో టీమ్ ఇండియా రికార్డు 2020 నుంచి అంత ఆశాజనకంగా లేదు. ఈ నేపథ్యంలో, రోహిత్ తన వ్యక్తిగత రికార్డులతో పాటు జట్టుకు సిరీస్ విజయాన్ని అందించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

న్యూజిలాండ్‌తో రెండో వన్డేకు భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ఎల్ రాహుల్ (కీపర్), శ్రేయస్ అయ్యర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్షదీప్ సింగ్, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, ఆయుష్ బదోని.



## భారత్‌లో ఆడే ప్రసక్తే లేదు..

వచ్చే నెలలో భారత్, శ్రీలంక వేదికలుగా ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్ 2026కు సంబంధించి పెను వివాదం నెలకొంది. తమ జట్టు మ్యాచ్‌లను భారత్ నుంచి తరలించాలన్న డిమాండ్‌పై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (దీజదీ) వెనక్కి తగ్గడం లేదు. మంగళవారం ఐసీసీ అధికారులతో జరిగిన కీలక వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా బంగ్లాదేశ్ తన మొండివైఖరిని స్పష్టం చేసింది. భద్రతా కారణాల దృష్ట్యా తమ ఆటగాళ్లు భారత్‌లో అడుగుపెట్టేది లేదని కుండబద్దలు కొట్టింది.

ఐసీసీ ప్రతిపాదనను తిరస్కరించిన బీసీబీ..

వరల్డ్ కప్ షెడ్యూల్, ప్రయాణ ప్రణాళికలు ఇప్పటికే ఖరారు అయ్యాయని, ఇప్పుడు వేదికలను మార్చడం సాధ్యం కాదని ఐసీసీ బంగ్లాదేశ్‌కు వివరించింది. భారత్‌లో క్రీడాకారులకు ఎలాంటి భద్రతా ముప్పు లేదని, తగిన జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. అయితే, ఈ హామీని తోసిపుచ్చిన బీసీబీ ప్రెసిడెంట్ అమీనుల్ ఇస్లామ్, తాము తమ నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఆటగాళ్ల ప్రాణాలకు ముప్పు ఉన్న చోట ఆడబోమని మరోసారి తేల్చిచెప్పారు.

వివాదానికి కారణం ఏంటి?

భారత్, బంగ్లాదేశ్ మధ్య ఇటీవలి రాజకీయ పరిణామాలు క్రికెట్ బోర్డుల మధ్య చిచ్చు పెట్టాయి. ముఖ్యంగా:

ముస్తాఫిజుర్ రెహమాన్ విడుదల: ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ నుంచి స్టార్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ ఆదేశాల మేరకు తొలగించడం బంగ్లాదేశ్‌ను ఆగ్రహానికి గురి చేసింది.

ఐపీఎల్ నిషేధం: దీనికి నిరసనగా బంగ్లాదేశ్ ప్రభుత్వం తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిషేధించింది.

భద్రతా భయాలు: భారత్‌లో బంగ్లాదేశ్ వ్యతిరేక భావనలు ఉన్నాయని, కాబట్టి తమ జట్టు మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ పట్టుబడుతోంది.

ఐసీసీ నివేదిక ఏం చెబుతోంది?

ఐసీసీ స్వతంత్ర భద్రతా ఏజెన్సీలు నిర్వహించిన సమీక్ష ప్రకారం, భారత్‌లో భద్రతా స్థాయి 'తక్కువ నుంచి మధ్యస్థంగా' ఉందని తేలింది. ఏదైనా భారీ అంతర్జాతీయ టోర్నీకి ఇది సాధారణ స్థాయి అని, బంగ్లాదేశ్ టీమ్‌కు ప్రత్యేకంగా ఎటువంటి ప్రమాదం లేదని ఐసీసీ నివేదిక స్పష్టం చేసింది. ఒకవేళ బంగ్లాదేశ్ జట్టు భారత్‌కు రాకపోతే, వారు తమ పాయింట్లను కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు సమాచారం.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com